క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మానవపాడు: మండలంలోని 33/కేవీ మానవపాడు, కలుకుంట్ల సబ్‌స్టేషన్ల పరిధిలోని ఆయా గ్రామాలలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఏ సయ్యద్ మక్బుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

24న లక్ష్మీచెన్నకేశవ స్వామి రథోత్సవం

రాజోళి: మండలంలోని పెద్ద ధన్వాడలో వెలిసిన లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఉత్సవాలు ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం ఉదయం పల్లకీతో ఊరేగించి దేవతలకు గంగస్నానం చేసి, విశేష పూజలు, అఖండ భజన, నందికోల సేవ నిర్వహిస్తారు. 24 ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం, కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్వాహకులు తెలిపారు.

కుక్కను ఢీ కొట్టిన బైక్: ముగ్గురికి గాయాలు

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై కుక్కను బైక్ ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన బుధవారం ఉండవెల్లి శివారులో వీకేర్ ఎదురుగా చోటుచేసుకుంది. మానవపాడుకు చెందిన నరసింహ తన భార్య పాపతో కలిసి కర్నూల్ వెళ్లి తిరిగి బైక్‌పై వస్తున్నాడు. వీకేర్ కోల్డ్ స్టోరేజ్ సమీపంలో కుక్క అడ్డు రావడంతో బైక్ ఢీకొని ముగ్గురు కిందపడ్డారు. గాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. గాయాలైన వారిని అంబులెన్స్‌లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేటీదొడ్డి: ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు వివరాల ప్రకారం.. మండలంలోని రంగాపురం శివారు నుంచి రంగాపురం గ్రామానికి అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ రంగస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జిప్సంను సద్వినియోగం చేసుకోండి

అయిజ: కేంద్ర ప్రభుత్వం రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా తక్కువ ధరకు అందిస్తున్న జింకు, జిప్సంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఫ్‌పీఓ (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) అయిజ బ్రాంచ్ అకౌంటెంట్ వినీత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు రూ.1100 చెల్లించి సభ్యత్వం తీసుకొని, రైతు ఉత్పత్తి దారుల సంఘం సభ్యత్వం తీసుకొని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలను తక్కువ ధరకు పొందవచ్చని తెలిపారు. వివరాలకు 9177022500 సంప్రదించాలని కోరారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

శాంతినగర్: రాయితీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వడ్డేపల్లి వ్యవసాయ అధికారి రాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఏడాదికి గాను 133 బస్తాల జీలుగ విత్తనాలు మండలానికి వచ్చాయని పేర్కొన్నారు. 60 శాతం సబ్సిడీపై రైతులకు అందజేస్తామని, 30 కిలోల బస్తా మొత్తం ధర రూ.2,790, సబ్సిడీ ధర రూ.1,671, రైతులు చెల్లించాల్సిన ధర రూ.1,116 ఉంటుదని తెలిపారు. జీలుగ విత్తనాలు కావల్సిన రైతులు పాలం పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు తీసుకుని ఆయా గ్రామాల్లోని వ్యవసాయ విస్తరణ అధికారిని (ఏఈఓ) సంప్రదించాలని ఏఓ సూచించారు.

చిన్నారుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

మల్దకల్: బరువు, ఎత్తు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. బుధవారం మల్దకల్‌లోని వివిధ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. రక్తహీనత ఉన్న గర్భిణీలు పోషకాలు ఎక్కువ ఉండే ఆహారపదార్థాలు తీసుకోవాలన్నారు. నెలనెలా క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలలో అందజేసే పౌష్టికాహారంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

28న సవారమ్మ జాతర

అమరచింత: పట్టణ శివారులో వెలసిన సవారమ్మ దేవత జాతర 28న మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు వాటర్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. 27న ఆలయం ఆవరణలో పందిరి వేయడంతో పాటు అమ్మవారి మూల విగ్రహాలకు కృష్ణానది జలాలతో ప్రత్యేక అభిషేకం చేయడంతో పూజలు నిర్వహిస్తామన్నారు. 28న అమ్మవారికి బోనాలతో తమ మొక్కులను చెల్లించుకుంటారని తెలిపారు.

నేనున్నానని..

- బాలల హక్కులు, రక్షణ కోసం చైల్డ్‌లైన్ 1098 ప్రాజెక్టు
- విస్తృతంగా అవగాహన సదస్సులు



గద్వాల ఆర్టీసీ బస్టాండ్‌లో సేవలపై అవగాహన కల్పిస్తున్న చెల్డ్‌లైన్ సిబ్బంది (ఫైల్)

గద్వాల అర్బన్: బాలబాలికల హక్కులు, రక్షణ కోసం చైల్డ్‌లైన్ 1098అనే కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు 24గంటల పాటు పని చేస్తోంది. టోల్‌ఫ్రీ నెం.1098కు కాల్ చేస్తే ఎక్కడి నుంచి కాల్ వచ్చినా స్థానిక పోలీసులు, బాలల సంరక్షణ సమితి సహ అక్కడ ఆపదలో, ఇబ్బందుల్లో ఉన్న బాల బాలికలను రక్షించి, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలోని బాలసదనం, ఇతర పిల్లల సంరక్షణ కేంద్రాలకు తరలిస్తారు. జిల్లా కేంద్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ విభాగం ద్వారా బాలల హక్కుల, సంరక్షణపై అవగాహన సదస్సుల ద్వారా చైతన్యం చేస్తున్నారు.



గద్వాలలో బాలరక్షక్ భవన్‌లో చైల్డ్‌లైన్ కార్యాలయం

విస్తృతంగా అవగాహన సదస్సులు

బాలల హక్కులపై బాలలసంరక్షణ సమితి ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. గద్వాల నియోజకవర్గంలోని గద్వాల, ధరూరు, మల్దకల్, కేటీదొడ్డి, గట్టు మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో, బస్టాండు, రైల్వేస్టేషన్, జనాలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఒవుట్ సర్వీసుల ద్వారా అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నారు. 18ఏళ్ల లోపు ఉన్న బాలల పనిలో పెట్టుకోకూడదని, బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, ఆడపిల్లల చదువు, సంరక్షణ, బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలపై వివరిస్తున్నారు. బాలల హక్కులపై తెలియజేస్తున్నారు. ఏదైనా సమస్యలుంటే వెంటనే 1098కు కాల్ చేయాలని, చైల్డ్ లైన్ ద్వారా అండగా ఉంటామని చెబుతున్నారు. కరపత్రాలు, పోస్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తూ చైతన్యం చేస్తున్నారు. ఆపదలో ఉన్న బాలలు 1098కు కాల్ చేసినప్పుడు అక్కడికి వెళ్లి వారి సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నారు. బాల్య వివాహాలపై వచ్చిన కాల్స్‌కు అక్కడి వెళ్లి అమ్మాయి వయస్సును పరిశీలించి నిజంగా బాల్య వివాహం జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకునేలా ముందుకెళ్తున్నారు. 0నుంచి 18ఏళ్ల లోపు బాల బాలబాలికలు ఎవరు ఆపదలో ఉన్నా టోల్‌ఫ్రీ నంబర్ 1098 ఒక్క కాల్‌తో సమాచారం అందిస్తే చైల్డ్‌లైన్ సంస్థ ప్రతినిధులు నిమిషాల్లో అక్కడి చేరుకోని ఆ బాలలను రెస్క్యూ చేస్తారు. చేరదీసిన పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించడం లేదా వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్యను అందించడం చేస్తున్నారు.

1098కు 133కాల్స్..

బాలల హక్కులపై 24గంటల పాటు అందుబాటులో ఉండే చైల్డ్‌లైన్ ప్రాజెక్టుకు కాల్స్ వస్తుంటాయి. ఇందులో ప్రధానంగా బాల్య వివాహాలు, విద్య, కుటుంబ సంబంధిత, బాల కార్మిక, భిక్షాటన, విద్యకు వసతి, మిస్సింగ్, న్యూట్రీషన్ ఫుడ్, బడి మానేసిన, రన్ వే, పోక్సో, ర్యాగింగ్, చైల్డ్ స్కూల్స్ ఇష్యూస్ తదితర వాటిపై 1098కు కాల్స్ వస్తుంటాయి. కాల్స్ వచ్చిన వెంటనే చైల్డ్ లైన్ సిబ్బంది అక్కడికి చేరుకుంటారు. ఇలా జిల్లా వ్యాప్తంగా గతేడాది ఏప్రిల్ నుంచి 133కాల్స్ వచ్చినట్లు చైల్డ్‌లైన్ ప్రతినిధులు తెలిపారు.

1098కు కాల్స్ చేస్తే బాలలను చేరదీస్తాం



బాలలకు ఎదైనా సమస్యపై 1098కు వచ్చిన కాల్స్‌పై వెంటనే స్పందిస్తున్నాం. వచ్చిన కాల్స్‌కు నిజానిర్ధారణ చేసుకోని అక్కడి వెళ్లి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. చైల్డ్‌లైన్ ద్వారా 24గంటల పాటు సేవలు అందిస్తున్నాం. చైల్డ్‌లైన్‌కు వచ్చిన కాల్స్‌లలో బాల కార్మిక వ్యవస్థ, భిక్షాటన, బాల్య వివాహాలు, అనాథ పిల్లలు, బడి మానేసి పిల్లలు, తప్పిపోయిన పిల్లలపై ఎక్కువ కాల్స్ వస్తున్నాయి. ఆపదలో, కార్మికులుగా ఉన్న బాలలకు సంబంధించిన సమాచారాన్ని టోల్‌ఫ్రీ 1098ద్వారా అందించాలి. బాలల హక్కులు, సంరక్షణపై విస్తృతంగా సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం.

– శివలీల, కో–ఆర్డినేటర్, చైల్డ్‌లైన్, గద్వాల

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

- జెడ్పీ చైర్‌పర్సన్ సరిత



లత్తీపురంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల రూరల్: అకాల వర్షాలు, ఈదురు గాలుల వల్ల నష్టపోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. బుధవారం ఆమె గద్వాల మండలం లత్తీపురం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆమె పరామర్శించారు. గాలివానకు పూర్తిగా గుడిసె కూలిపోయిన ముస్టి దుబ్బరంగన్న, వడ్డేతిమ్మన్న కుటుంబాలకు తనవంతుగా ఆర్థిక సాయమందించారు. గత ప్రభుత్వ హయాంలో పది సంవత్సరాల కాలంలో నిరుపేదలకు ఇళ్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ పార్టీ నష్టపోయిన వారిని ఆదుకోవడమే కాకుండా అర్హులైన ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మధుసూదన్‌బాబు, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఈశ్వర్, జయన్న, లక్ష్మణ్, జమ్మిచేడు ఆనంద్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల ఉత్సవాలు





పారుచర్ల సవారమ్మ అవ్వ గుడి వద్ద మొక్కులు సమర్పించుకుంటున్న భక్తులు, బోనంతో మహిళ

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో గ్రామ దేవతల ఉత్సవాలు నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పారుచర్ల, జాంపల్లి, మన్నాపురం, కోతులగిద్ద, అల్వలపాడు గ్రామాల్లో సవారమ్మ అవ్వ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేకలు, పొట్టేళ్లను ఆలయం వద్దకు తీసుకొచ్చి అర్పించారు. గ్రామాల్లో బంధువులు రావడంతో పండుగ వాతావరణం నెలకొంది.



మైలగడ్డలో హాజరైన భక్తులు

మాారెమ్మ, సవారమ్మ జాతర

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె, మైలగడ్డ, గ్రామాల్లో మారెమ్మ, సవారమ్మ జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆలయం దగ్గరకు మహిళలు బోనాలతో వెళ్లి భక్తులు దాసంగాలు, పొట్టేళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించిన ఉత్సవాలకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉన్నారు.

ఉద్యమాలకు సంపూర్ణ మద్దతు



కేవీపీఎస్ నాయకులకు నగదు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

గద్వాల అర్బన్: సామాజిక ఉద్యమాలకు కార్మిక వర్గం సంపూర్ణ మద్దతు ఇస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో దళితుల ఉద్యమానికి సహకారంగా రూ.6800లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా దళితులు చేసే ప్రతి పోరాటం, ఉద్యమంలో భాగస్వామ్యమవుతామన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం, దళితుల అభ్యున్నతి కోసం కేవీపీఎస్ చేసే పోరాటాలకు తమ వంతు మద్దతు ఎల్లప్పుడు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి వీవీ నర్సింహ, జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నర్సింహ, తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకులు అందజేసిన ఎమ్మెల్యే



ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామంలో గామా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద వారికి రైతు వేదికలో నిత్యావసర సరుకులు ఎమ్మెల్యే విజేయుడు అందజేశారు. కార్యక్రమంలో గామా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

అందుబాటులో ఆర్‌ఎన్‌ఆర్ వరి విత్తనాలు



రైతులకు వరి విత్తనాలను అందిస్తున్న ఏఈఓ

అమరచింత: మండలంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లో 25 కేజీల ఆర్ఎన్ఆర్ వరి విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ తెలిపారు. 25 కేజీల ఆర్ఎస్ఆర్ వరి విత్తనాలను సబ్సిడీతో రూ.1,094 అందిస్తున్నామని వెల్లడించారు. వీటితో పాటు జీలుగ విత్తనాలను అందిస్తున్నామన్నారు. రైతులు పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను వ్యవసాయ కార్యాలయంలో అందించి పర్మిట్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఈఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

గద్వాల క్రైం: విధి నిర్వాహణలో ఉంటూ మృతి చెందిన ఇటిక్యాల పోలీసుస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ కుటుంబ సభ్యులకు బుధవారం ఎస్పీ రితిరాజ్ రూ.10 వేల చెక్కును భార్య రాజేశ్వరికి అందజేసి వారితో మాట్లాడారు. త్వరలో ఇతర బెనిఫిట్ల ద్వారా వచ్చే ఎక్స్‌గ్రేషియ త్వరలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు సిబ్బంది భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.

తక్కశిలలో కల్యాణ మహోత్సవం



కల్యాణానికి హాజరైన భక్తులు

ఉండవెల్లి: మండలంలోని తక్కశిలలో ఉత్సవాల సందర్భంగా మధ్యాహ్నం లక్ష్మీనరసింహ కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి, అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించారు. రాత్రి సమయంలో ఉమరామలింగేశ్వర స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు, కల్యాణం నిర్వహించారు. అనంతరం రాత్రి సమయంలో నందికోల సేవ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



తక్కశిలలో ఉమరామలింగేశ్వర స్వామి ఆలయంలో కల్యాణం చేస్తున్న అర్చకులు

రాంపాటి శివాలయంలో సందడి

రాజోళి: మండల కేంద్రంలోని తుంగభద్ర నది మధ్యలో రాంపాటి శివాయలంలో బుధవారం భక్తులు సందడి చేశారు. స్థానికులతో పాటు శాంతినగర్, వడ్డేపల్లి తదితర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నది మధ్యలో ఉన్న ఆలయం గురించి చర్చించుకుంటూ, ఆలయ పరిసరాలలో సరదాగా గడిపారు.

కల్వర్టుల నిర్మాణం అయ్యేనా?

- వర్షాకాలంలో ప్రయాణానికి తిప్పలు
- ఏళ్లు గడుస్తున్నా.. గ్రామీణులకు ఎదురుచూపులే..
- ప్రతిపాదనలకే పరిమితం
- గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు



మానవపాడు - అమరవాయి గ్రామాల మధ్య ఉన్న వంతెనపై పారుతున్న వర్షపునీరు (ఫైల్)

మానవపాడు: ఎన్నో ఏళ్ల ఆశగా ఎదురుచూస్తున్నా, కల్వర్టుల నిర్మాణం పూర్తికావడం లేదు. మండలంలోని రైతులు, ప్రయాణికులు, వాహనదారులు వర్ష కాలం వచ్చిందంటే ఎలా వెళ్లాలో తెలియని పరిస్థితి. పల్లెపల్లెకు అనుసంధానంగా ఉండే గ్రామీణ రోడ్ల వెంట వాగులు, వంకలపై వంతెనలు నిర్మాణం లేక ప్రయాణికులకు, వాహనాదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా, గ్రామాల మధ్య రోడ్లపై రాకపోకలు నిలిచిపోతున్నాయి. మండలంలోని పలు గ్రామాల మధ్య ఉన్న ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన బీటీ రోడ్ల మధ్య ఉన్న వాగులపై వంతెనలు లేక పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు కాడెద్దుల బండ్లతో రోడ్లపై రాకపోకలు సాగిస్తున్నారు. వాగుల వద్ద పలు సందర్భాలలో రైతుల ఎద్దుల బండ్లు ప్రమాదాలకు గురవుతున్నాయి. వర్షాలు వచ్చనప్పుడు కల్వర్టులు లేని వాగుల వద్ద వర్షం వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తూ.. ప్రజల రాకపోకలు స్తంభించిపోతాయి. ప్రజలు సమస్య విన్నవించినప్పుడు అధికారులకు ఆదేశాల జారీ చేసి వెళ్లిపోతున్నారు. ఆచరణలో కల్వర్టుల నిర్మాణం కావడం లేదు. మానవపాడు మండలంలోని 17 గ్రామాలున్నాయి. వర్షాకాలంలో వంతెనలపై వెళ్లేందుకు ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మండలంలో మానవపాడు–అమరవాయి, చెన్నిపాడు–మానవపాడు, అమరవాయి–కలుకుంట్ల మధ్య వంతెనలపై కల్వర్టులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.



మానవపాడు- అమరవాయి వెళ్లే వంతెన

వంతెన నిర్మించాలి



మానవపాడు మండలంలోని అమరవాయి–మానవపాడు గ్రామాల మధ్య వంతెన నిర్మించాలి. వర్షం కురిసిందంటే రాకపోకలకు తీవ్ర అంతరాయం ఉంటుంది. కలుకుంట్ల, మద్దూరు, శాంతినగర్, చంద్రశేఖర్‌నగర్ గ్రామాలకు వెళ్లేందుకు వాగులో నీళ్లు వచ్చినప్పుడు అంతరాయం తప్పదు. అధికారులు, పాలకులు చొరవ చూపి వంతెన నిరించాలి.

– అబ్దుల్‌నబీ, అమరవాయి

తాత్కాలిక వంతెన ఏర్పాటు చేయండి



మండలంలోని చెన్నిపాడు నుంచి మానవపాడుకు అమరవాయి నుంచి మానవపాడుకు వెళ్లే దారిలో వర్షాకాలం ప్రయాణించడం ఇబ్బందిగా ఉంటుంది. రోడ్డు మార్గంలో దాటడానికి తాత్కాలికంగా వంతెనలు ఏర్పాటు చేయాలి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– జమ్మన్న, చెన్నిపాడు

అధికారులకు ప్రతిపాదనలు పంపించాం

అలంపూర్ నియోజకవర్గంలోని మండలాల్లో ఉన్న వంతెనలు నిర్మాణాలు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారులకు నివేదికలు సైతం ప్రతిపాదించాం. వంతెనలకు నిధులు మంజూరైతే నిర్మాణం చేపడతాం.

– మహేష్, ఆర్అండ్‌బీ అలంపూర్ ఇన్‌చార్జి

లక్ష్మీనరసింహస్వామి జయంతి

మల్దకల్: మండల కేంద్రంలో లక్ష్మీ నరసింహస్వామి జయంతి భక్తులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామి వారి జయంతికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, అర్చకులు రవిచారి, నాగరాజుశర్మ, నరేందర్‌శెట్టి, కృష్ణ, వినోద్, భక్తులు పాల్గొన్నారు.



మల్దకల్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మల్లాపురంలో సుదర్శణ హోమం



పూజల్లో పాల్గొన్న భక్తులు



పూజలు చేస్తున్న పూజారులు

ఆత్మకూర్: పట్టణ శివారులోని మల్లాపురం శ్రీఆంజనేయస్వామి, శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంవద్ద ప్రముఖ వేదపండితులు శ్రీనివాసరాఘవన్, వెంకటశేషశర్మ, కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనర్సింహాస్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం సుదర్శణహోమం, ఆరోహణ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం, శుక్రవారం నవకలశాలతో స్వామివారికి అభిషేకం, హోమం, పుణ్యాహవాచనం, విశ్వక్‌సేవ, ఆరాధన, పల్లకీసేవ, ఎదుర్కోళ్లు, గరుడధ్వజారోహణ, యువతి, యువకుల కల్యాణపూజ, ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలకు రక్షణ కరువు

అమరచింత: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు రక్షణ కరువైంది. పాఠశాలలోని తరగతి గదుల తలుపులను రాత్రివేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు విరగ్గొడుతుండటంతో తరగతి గదుల్లో అసాంఘిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని పట్టణ ప్రజలు తెలిపారు. పాఠశాలకు నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో రాత్రుల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఇలాంటి పనులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. పాఠశాల ఆవరణం చుట్టూ సీసీ కెమెరాలను పెట్టించినా.. పాఠశాల ముఖద్వారం భాగానికి అమర్చిన సీసీ కెమెరాను కదిలించడంతో అది నేల వాలింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలకు నైట్‌వాచ్‌మెన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.